ప్రార్ధనని ప్రారంభించాక క్రమేపీ ఆయనలోని ఆ కోపం తగ్గింది. ఆఖరి మూడు రోజులు ఆయన జోక్స్ వేసి మమ్మల్ని నవ్వించారు కూడా. కలిసి గీతా పఠనం చేసాం. మీ ప్రార్ధన వూరికే పోలేదు. చక్కటి ఫలితాన్ని ఇచ్చిందని మీకు తెలియచేద్దామని వచ్చాను." చెప్పిందామె.

## 8. గూఢచారి

ఓ మఠంలోని వారంతా ప్రార్ధనా మందిరానికి ఎప్పటిలా ఉదయం అయిదున్నరకల్లా వచ్చేసారు. కొద్ది నిముషాల్లో ఆ మఠాధిపతి అక్కడికి వచ్చాడు. అతని వెంట ఓ కొత్త వ్యక్తి రావడం మఠవాసులంతా గమనించారు. ఉదయపు ప్రార్ధన అయాక మఠాధిపతి అందరితో చెప్పాడు.

"మన మఠం పెట్టి ఇవాళ్టికి సరిగ్గా సంవత్సరం పూర్తయింది. నేను ఎప్పటిలా ఈ రోజు ప్రవచనం చెప్పడం లేదు. ఇతనేం చెప్తాడో మనం అందరం విందాం. ఎందుకంటే నేను చెప్పే ప్రవచనం కన్నా ఇతను చెప్పబోయే దాన్నించి మీరంతా నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది."

అంతా ఆ కొత్త వ్యక్తి వంక ఆసక్తిగా చూసారు. తమలా సన్యాసి కాదు. పేంట్, షర్టుల్లో ఉన్న అతను తామంతా నేర్చుకోవాల్సింది ఏం చెప్తాడబ్బా అనుకున్నారు. మఠాధిపతి అతన్ని ప్రారంభించమన్నట్లుగా సైగ చేసి, కార్డ్లెస్ మైక్‌ని ఇచ్చాడు. అతను వెంటనే గొంతు సద్దుకుని చెప్పసాగాడు.

" ముందుగా మీ అందరికీ నా నమస్కారాలు. నా పేరు రామాచారి. నేను ఓ గూఢచారిని. మీ మఠం వ్యవహారాలు ఎలా ఉన్నాయో తెలుసుకోమని నన్ను మీ మఠాధిపతి కొద్ది రోజుల క్రితం నియమించారు. నిన్న ఉదయం నించి రాత్రి దాకా నేను మీ మఠంలోనే, మీ మధ్యే గడిపాను. నిన్న ఉదయం భగవద్గీత క్లాసులో, ఉదయపు ప్రార్ధనలో, మధ్యాహ్న భోజనం, సాయంత్రం ధ్యానం క్లాసులో, రాత్రి భోజనంలో నేను మీతో పాటు పాల్గొన్నాను."

రామాచారి జేబులోంచి ఓ కాగితాన్ని తీసి దాన్ని చూస్తూ తను చెప్పేది మళ్ళీ కొనసాగించాడు.

"మీ మఠం ఎలా పనిచేస్తోంది అన్న విషయం మీద నేను కొన్ని అంశాలని ఎంచుకుని, వాటికి కొన్ని మార్కులని కేటాయించుకున్నాను. ఆ వివరాలివి. నేను నవ్వగానే మఠంలోని వారు తిరిగి స్నేహపూర్వకంగా నవ్వితే పది మార్కులు. నన్ను చూసి తమంతట తామే ఈ మఠంలోని వారు నవ్వితే ఏభై మార్కులు. నేను అడిగిన ప్రశ్నకి ఎదురు ప్రశ్న వేయకుండా వెంటనే జవాబు చెప్తే వంద మార్కులు. నాతో మాట్లాడేప్పుడు విసుక్కోకుండా నమ్రతగా మాట్లాడితే రెండు వందల మార్కులు. ఈ రోజు దినపత్రిక అడగగానే దాన్ని చదివేవారు వెంటనే ఇస్తే అయిదువందల మార్కులు. మఠం ప్రచురించిన పాత పత్రికలు నేను అడగగానే వెదికి ఇస్తే వెయ్యి మార్కులు. మఠాధికారిని నాకు పరిచయం చేయమని అడిగితే, నా కోరిక మన్నించి ఆయన్ని నాకు వెంటనే పరిచయం చేస్తే రెండు వేల మార్కులు."

అతను చెప్పేది అంతా శ్రద్ధగా వింటున్నారు.

"మీ మఠంలో నేను నిన్న ఇవన్నీ అమల్లో పెట్టాను. బదులుగా మీ మఠానికి వచ్చిన మార్కులు నూట ఇరవై! ఏడాదిగా ఇక్కడ మీరు వినే ప్రవచనాలన్నీ ఆధ్యాత్మికంగా మిమ్మల్ని ముందుకు తీసుకెళ్ళడానికి ఉద్దేశింపబడ్డవే కావచ్చు. ఇక్కడి వాతావరణం భక్తి పూర్వకంగా ఉండచ్చు. ఇక్కడ మీరంతా ప్రపంచంలోని వారిలా కాక, వ్యామోహాలని జయించి తక్కువ అవసరాలతో జీవిస్తూండి ఉండచ్చు. కాని మీ మఠానికి వచ్చిన అతిథిని ఆదరించి ప్రేమించే విషయంలో మీకు వచ్చిన మార్కులు అతి తక్కువని చెప్పడానికి చింతిస్తున్నాను. ఓ కొత్త వ్యక్తిని మీరు ఆదరించకపోతే రెండు జరగచ్చు. ఒకటి. అతను రెండోసారి తిరిగి ఇక్కడికి రాకపోవచ్చు. రెండు. మీరు ఇక్కడ నేర్చుకున్నవి ఎంతమాత్రం వంట పట్టించుకోవడం లేదని భావించవచ్చు. ఈ రెండూ మీకు, మీ మఠానికి ఎంత మాత్రం మంచివి కావు అని మీరు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను."

హాల్లో గుండు సూది పడితే వినపడేంత నిశ్శబ్దం అలుముకుంది. అంతా ఒకరి వంక మరొకరు చూసుకోసాగారు.

"థాంక్ యు ఒన్ అండ్ ఆల్."

తన చేతిలోని మైక్‌ని మఠాధిపతికి ఇచ్చి పక్కకి వెళ్ళిపోయాడు గూఢచారి రామాచారి. మఠాధిపతి చెప్పసాగాడు.

“ప్రేమని, నవ్వులని మనం ఇతరులకి పంచితేనే ఆనందం వెల్లివిరుస్తుంది. అదే ఎవరికైనా పెద్ద పెట్టుబడి. ఆ పెట్టుబడిని మనం వడ్డీతో సహా తప్పక అనుభవిస్తాం అని శాస్త్రం స్పష్టంగా చెప్తోంది. అది ఈ దేహంతో, ఈ లోకంలో ఇక్కడే మనం అనుభవించలేక పోవచ్చు. పై లోకాల్లో మనకి అవసరమయ్యే సంపదని మనం ఇక్కడే, ఈ దేహంతోనే సంపాదించుకుని కేవలం ఇక్కడ నించే తీసుకెళ్ళాలని మీకందరికీ తెలుసు. ఈ దేహం వదిలాక మనం వెళ్ళే లోకంలోకి కోటీశ్వరుడిలా వెళ్ళాలా లేక బిచ్చగాడిలానా అన్నది మీకే వదిలేస్తున్నాను. ఇక మీ ఇష్టం.”

## 9. నీడ

ఓ ధనికుడు గొప్ప దాత. ‘నేను సంపాదించిన దాన్ని నేను దానం చేస్తున్నాను’ అనే భావన లేకుండా, ‘అంతా దేవుడి సొమ్ము’ అనే నమ్మకంతో దానం చేసేవాడు. అతని ఈ సాత్విక దాన గుణానికి సంతోషించిన దేవుడు ఓ రాత్రి అతనికి కలలో కనపడి చెప్పాడు.

“నీ దాన గుణానికి మెచ్చాను. నీ నీడకి కూడా దానం చేసే గుణాన్ని ప్రసాదిస్తున్నాను.”

వెంటనే ఆతను దేవుడి పాదాలకి మొక్కి చెప్పాడు.

“మీ మాటకి అడ్డొస్తున్నాననుకోక పోతే, నా నీడ ముందు కాని, నాకు రెండు పక్కల కాని వున్నప్పుడు కాక, కేవలం నా వెనక వున్నప్పుడే దానం చేసే శక్తిని దానికి ప్రసాదించవలసిందిగా కోరుతున్నాను.”

“ఎందుకని?” ప్రశ్నించాడు దేవుడు.

“లేకపోతే నా నీడ కూడా దానం చేస్తోందన్న అహంకారం నాలో కలగచ్చు. నా వెనక అది ఏం చేసినా నాకు తెలీదు కదా. నీడలా వెన్నాడే అహంకారం బారిన నేను పడదలచుకోలేదు.” వివరించాడు ఆ ధనవంతుడు.